www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 3 ఆగస్టు 2025
5
ఏలూరు

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు అర్బన్ :జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఈ ఏడాదిలో మూడో జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 13వ తేదీ (రెండో శనివారం) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలో నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులతో పాటు సివిల్, వాహన ప్రమాద బీమా, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ వివాదాలు, టెలిఫోన్ బకా యిలు, చిట్ ఫండ్ కేసులు రాజీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ అన్ని పనివేళల్లో ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా లేదా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను, అన్ని కోర్టుల పరిధిలోని మండల న్యాయ సేవాధికార కమిటీలను సంప్రదించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

కొత్త ఇళ్లు లేవు.. పాత బకాయిలు ఇవ్వరు..!

- 2014-19లో నిర్మించిన ఇళ్ల బకాయిలపై మాటలకే పరిమితం
- రెండు జిల్లాల్లో రూ.81 కోట్లు వరకు బకాయిలు
- కొత్త ఇళ్ల నిర్మాణానికి అందని ప్రభుత్వ సాయం
- రెండు జిల్లాల్లో దాదాపు 40 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్
- ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. ఆచరణకు పొంతన లేకుండాపోయింది. కొత్తగా ఇళ్ల నిర్మాణం, పాత బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం సామాన్య ప్రజానీకంతో ఆటలాడుతున్న పరిస్థితి. ముఖ్యంగా సొంతింటి కల నెరవేర్చుకునేందుకు సిద్ధమైన లబ్ధిదారులకు ప్రభుత్వం సాయం అందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచిపోయింది. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలనుకునేవారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణంపై అయోమయం నెలకొంది. ఇళ్ల నిర్మాణం చేపట్టినా తర్వాత ప్రభుత్వ సాయం అందదేమోనని భయం వెంటాడుతోంది. నిరీక్షిస్తే ధరలు పెరిగి మరింత భారం పడుతుందని ఆందోళన మరోపక్క వెంటాడుతోంది. గతంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షల సాయం అందించేది. దీంతో ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా కొంత ఊరట దక్కేది. పెరిగిన ధరలతో ప్రభుత్వం అందించే సాయం సరిపోవడం లేదని రూ.5 లక్షలకు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటి వరకు దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదు. కొత్తగా ఇళ్ల నిర్మాణం కోసం ఏలూరు జిల్లాలో 27 వేల దరఖాస్తులు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో అదేస్థాయిలో దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. వీళ్లంతా ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందని పరిస్థితి. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రభుత్వం సాయం ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతామన్న దిగులు అందరినీ వెంటాడుతోంది. కొత్త ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే సాయం అందించాలని జనం కోరుతున్నారు. గతంలో ఇచ్చిన సాయం ఏమాత్రం సరిపోదని పెంచాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది.

పాత బకాయిల చెల్లింపు మాటలకే పరిమితం

2014-19 మధ్యకాలంలో ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం ద్వారా వేలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం రూ.2.50 లక్షల సాయం (లోను) అందించేది. ఈ సొమ్ములో రూ.లక్షన్నర కేంద్రం నుంచి, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది. అప్పట్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల్లో కొంతమందికి తొలివిడత, మరికొంతమందికి రెండో విడత కింద సాయం కొంతమేర అందింది. చాలామందికి చిల్లిగవ్వకూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. 2019 ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణాల రుణ బకాయిలు విడుదల చేస్తామని అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం చెప్పినా ఇవ్వలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో అప్పుడు చేసే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2014-19 మధ్య ఇళ్ల బకాయిలు చెల్లిస్తామని ప్రకటించింది. దీనిపై సర్వే చేసి ఎంతమేరకు తేల్చాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సర్వే చేసిన అధికారులు ఏలూరు జిల్లాలో 26,840 ఇళ్లు నిర్మించగా రూ.40.90 కోట్లు, పశ్చిమలో 25,855 ఇళ్లు నిర్మించగా రూ.40.75 కోట్లు బకాయి ఉన్నట్లు తేల్చారు. ఇదిగో.. అదిగో అనడం తప్ప ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో చిల్లిగవ్వ కూడా జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు బకాయి సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పాతబకాయిలు వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండాపోయింది.

1,60,968 మంది రైతులకు 'సుఖీభవ'

సాగులో యాంత్రీకరణకు, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం
కలెక్టర్ వెట్రిసెల్వి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - కామవరపుకోట (చింతలపూడి)

అన్నదాతా సుఖీభవ పథకంలో జిల్లాలోని 1,60,968 మంది రైతులకు రూ.107.08 కోట్లు అందించామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. కామవరపుకోటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన అన్నదాతా సుఖీభవ కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. రైతులకు నమూనా చెక్కును అందజేశారు. తొలుత కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ జ్యోతిని వెలిగించి కార్యకమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతునీ జిల్లాలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో గుర్తించి, వారి ఖాతాల్లో రూ.ఏడు వేలు చొప్పున అందించామన్నారు. గత రబీ, ఖరీఫ్ సీజన్లలో రూ.1088 కోట్లు విలువైన ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసి, 24 గంటల్లోపు రైతుల ఖాతాలకు నగదు జమ చేశామన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, జిల్లాలో ఇంతవరకు 50 డ్రోన్లు సబ్సిడీపై రైతాంగానికి అందించామని చెప్పారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎనిమిది మంది రైతులకు డ్రోన్లు అందించామని, అర్హత, ఆసక్తి కలిగిన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే డ్రోన్లు అందిస్తామన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. అర్హులైన కౌలు రైతులకు రుణార్హత కార్డులు జారీచేసి సాగుకు రుణాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో కోకో రైతుల సమస్యలు పరిష్కరించామన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలకన్నా అధికంగా చింతలపూడి నియోజకవర్గంలో అన్నదాతా సుఖీభవ పథకం కింద 36,818 మంది రైతులకు రూ.24.55 కోట్లు అందించారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రతిఒక్కటీ అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ దేవకీదేవి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌భాషా, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి సుధీర్‌బాబు, స్థానిక నాయకులు ముత్తారెడ్డి, మారుమూడి మల్లికార్జునరావు, నంబూరి రాజా, రామలింగేశ్వరరావు, కంఠమని శ్రీనివాసరావు, సాయికృష్ణ, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం సభ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార ధాన్యాలు, కూరగాయల ప్రదర్శనలు, వ్యవసాయ శాఖ ఏర్పాటుచేసిన సాంప్రదాయ వ్యవసాయ స్టాల్స్‌ను కలెక్టర్, ఎంఎలఎ పరిశీలించారు.



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ఇతర సమస్యలు పరిష్కరించాలి
కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్‌రావు, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, కోఛైర్మన్ జి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు పిల్లలు చదువు నేర్చుకోవడానికి బడికి వస్తే టీచర్లు చదువు నేర్పేవారని, ఇప్పుడు పిల్లలు బడికి వచ్చేది మధ్యాహ్న భోజనం, దుస్తులు, కోడిగుడ్లు, చిక్కి, రాగిజావ కోసం మాత్రమే అన్నట్లు, టీచర్లు వీటిని పిల్లలకు అందించి ప్రభుత్వానికి లెక్కలు చెప్పడానికే అన్నట్లు పరిస్థితి తయారైందని విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసేవారిలా టీచర్లను మారుస్తున్నారన్నారు. అనేక సమస్యలు ఉపాధ్యాయులను వేధిస్తున్నాయని, బదిలీలు జరిగి రెండు నెలలైనా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని, బదిలీ అయ్యి కోరుకున్న పాఠశాలలో చేరే పరిస్థితి ఉందా అంటే, అదీ లేదని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు వేలకుపైగా, మరికొన్ని జిల్లాల్లో 400కుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హైస్కూల్ ప్లస్ సంగతి మరీ అధ్వానంగా ఉందని తెలిపారు. ఒకరిద్దరితో నడిచే పాఠశాలలు కూడా ఉన్నాయని, ఉన్నత విద్య చదివి హైస్కూల్ ప్లస్‌లో బోధించాలని ఉత్సాహపడిన టీచర్లకు చేదు అనుభవం ఎదురైందన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, మరే ఇతర పనులకు ఉపయోగించరాదని, పి-4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదని, బదిలీలైన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, ఏకీకృత సర్వీసు సమస్యలు పరిష్కరించి, విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించి 72, 73, 74 జిఒలు అమలు చేయాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌లో వెంటనే ఉపాధ్యాయులను నియమించి వాటిని కొనసాగించాలని, పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, ఈలోపు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఎంఇఒలను గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను ఎంఇఒలుగా పరస్పరం బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని, ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని, పరీక్షలను తెలుగులో రాసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించిన ఎపి జెఎసి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ 11వ పిఆర్‌సి గడువు ముగిసి రెండు సంవత్సరాలు పూర్తయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున గద్దె దిగాల్సి వచ్చిందని, ఈ ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటినా ఇంకా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు చేపట్టే కార్యక్రమాలకు జెఎసి అండగా ఉంటుందని తెలిపారు. ఫ్యాప్టో కోఛైర్మన్ ప్రకాష్‌రావు, నాయకులు రెడ్డి దొర, శామ్యూల్, శివరాం, రమేష్, జిలానీ, వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, నేతలు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ప్రజా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీన విద్యుత్ భవనం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక తంగెళ్లమూడి సెంటర్లో ప్రజా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచబోమని చెప్పి ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చి, నేడు దానికి భిన్నంగా వివిధ రూపాల్లో భారాలు మోపుతుందని విమర్శించారు. ఈ భారాలను వ్యతిరేకిస్తూ ఈ నెల ఐదో తేదీన ధర్నాల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగించారు. తంగెళ్లమూడి సెంటర్ నుంచి ఆదివారపే మీదుగా గన్‌బజార్ సెంటర్ వరకూ నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, ఉప్పులూరు హేమశంకర్ పాల్గొన్నారు.

టి.నర్సాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం స్మార్ట్ మీటర్లపై ప్రజావేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ నాయకులు బిఎన్.సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం నాయకులు గుడెల్లి వెంకట్రావు, ఎంఎల్ పార్టీ నాయకులు కారం భాస్కర్ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5న మండలకేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, నేతలు కుమారి, సిరిబత్తుల సీతారామయ్య, కొండముచ్చు శ్రీనివాసరావు, పూసం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్ : స్మార్ట్ మీటర్ల రద్దు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీన తలపెట్టే విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడిని విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో స్మార్ట్‌మీటర్ల రద్దుపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడారు. అదానీతో స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను విరమించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమావేశంలో కురాకుల బాబూరావు, యర్నం సాయికిరణ్, పొట్ల లక్ష్మయ్య, షేక్ వలీ పాషా, పులందాసు రమేష్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు తెల్లం రామకృష్ణ, కారం రాఘవ, మొడియం నాగమణి, బన్నే వినోద్‌కుమార్, బాబూరావు మాట్లాడారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముసునూరు: మండలంలో వివిధ గ్రామాల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ మాట్లాడగా నేతలు పిల్లి మురళి, కుటుంబరావు, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : ట్రూఅప్ ఛార్జీల పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఛార్జీల పెంపును నిలుపుదల చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దని ఈ నెల 5న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. జక్కుల మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, సభ్యులు చిన్నం మాధవ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

అధికారులకు బాధ్యత లేదా..!

- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
- వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం
- ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇచ్చేలా చూడాలన్న డిప్యూటీ స్పీకర్
- పలు సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, సిటీ

కీలకమైన జిల్లా పరిషత్ సమావేశానికి ఆయా శాఖలకు బాధ్యత వహించే జిల్లా ఉన్నతాధికారులు హాజరు కాకపోతే ఎలాగని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమయానికి సమావేశానికి హాజరుకాకపోవడంపై మంత్రి మండిపడ్డారు. శనివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంఎల్ఎలు పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, జెడ్‌పి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులను ఇస్తుందన్నారు. ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు సముచితమైన గౌరవం ఇవ్వాల్సి ఉందన్నారు. ఇలాంటి కీలక సమావేశాలకు కిందిస్థాయి ఉద్యోగులను పంపిస్తే, సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుందన్నారు. అధికారులు చురుగ్గా పని చేయాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు ఎంత ముఖ్యమో ప్రజాసమస్యల పరిష్కారానికి జెడ్‌పి సర్వసభ్య సమావేశం అంతే ముఖ్యమన్నారు. ఇకపై తాను రెగ్యులర్‌గా ఈ సమావేశాలకు హాజరవుతానన్నారు. జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ స్కూళ్లలో ఆగస్టు 15కు జెండా వందనం చేయడం తొలగించారని, పునరుద్ధరించాలని కోరారు. రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్లకు సొమ్ము రావడం లేదన్నారు. పామాయిల్ ధర నిలకడగా ఉండేలా చూడాలన్నారు. పది రోజులకు ముందుగానే ఎజెండా కాపీలు ఇవ్వాలని కోరారు.

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి

కొల్లేరు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ పూర్తికి, కొల్లేరు సమస్య పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. ఇటీవల కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికారిత కమిటీ కోరిన సమాచారాన్ని సమగ్రంగా స్పష్టతతో సంబంధిత అధికారులు నివేదిస్తే ఈ విషయంపై కేంద్రంతో తాము సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం కింద ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కల్పించి చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదవిద్యార్థులతో భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్ పెంపు ఆక్వారంగానికి తీరని నష్టం తెస్తుందన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీకి పదెకరాల నిబంధనను తీసేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రేట్లు తగ్గాయని, ఫీడ్ ధర రూ.రెండు తగ్గిందని, పరిశ్రమలు సుంకం భరిస్తే ఆక్వా రైతులు మనుగడ సాధిస్తారన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలన్నీ ఒకొక్కటిగా అమలు చేస్తుందన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రత్యేక అధికారులుగా హాజరయ్యారని, దానివల్లే కొందరు అధికారులు ఆలస్యంగా హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి కారణం లేకుండా హాజరు కాని అధికారులకు సంబంధించి విచారణ చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. సమావేశంలో కొవ్వూరు ఆర్‌డిఒ సుస్మితరాణి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఎంఎల్‌ఎపై అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుపై వస్తున్న అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనపై గతంలో కూడా అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందులో వాస్తవాలను, అవాస్తవాలన్నింటిని పరిశీలించాలని తెలిపారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అవినీతి చేశారని కూటమి నేతలు కరాటం రాంబాబు, దేవినేని ఉమాల ఫోన్ సంభాషణపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి నిజానిజాలను బయటకు తీయాలని పేర్కొన్నారు. పోలవరం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌ఆర్, ఇసుక, భూములపై పెద్దఎత్తున అవినీతి జరిగిందని గతంలో ఆరోపణలు వచ్చాయని, దీనిపై వార్తలు రాసిన విలేకర్లపై కేసులు పెడతామని బెదిరింపులకు గురి చేశారని తెలిపారు. ఇంత పెద్దఎత్తున అవినీతి జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలపై వెంటనే విచారణ చేపట్టాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు.

ఆర్‌జియుకెటిలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు. గుంటూరు క్రైం బ్రాంచ్ విభాగం డిఎస్‌పి జి.లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మానాన్న మీద ప్రేమ లేకపోయినా, గురువు మీద పూజ్యభావం లేకపోయినా, దేశం మీద భక్తి లేకపోయినా ర్యాగింగ్ చేసే గుణం ఉన్నట్లని చెప్పారు. చెడుకు అలవాటుపడి మంచిని గ్రహించకపోవడమే ర్యాగింగ్ అవుతుందన్నారు. చదువుకోడానికి వచ్చిన విద్యార్థిని చూసి నువ్వు చదవలేవు అని చెప్పడం కూడా ర్యాగింగేనన్నారు. ఎవరి జీవితాన్ని వారే సార్థకం చేసుకోవాలన్నారు. చదువు అంటే అర్థం చేసుకోవడం, అవగాహన చేసుకోవడం అనే విషయాన్ని మనం నిజంగా గ్రహిస్తే ఇతరులను ర్యాగింగ్ చేయడానికి ఇష్టపడమన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే సంస్కారగుణాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదవాలని, నీ చదువు చరిత్రను మార్చకపోతే నిన్ను నువ్వు సెల్ఫ్ ర్యాగింగ్ చేసుకున్నట్లు అవుతుందనే విషయాన్ని గ్రహించాలని చెప్పారు. విద్యార్థులు ర్యాగింగ్ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం లక్ష్మయ్యను మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ సండ్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ చిరంజీవి, డిఎస్‌డబ్ల్యూ డాక్టర్ రాజేష్, డాక్టర్ దుర్గాభవాని, చీఫ్ వార్డెన్స్ సురేష్‌బాబు, డాక్టర్ గౌతమి, పిఆర్‌ఒ డాక్టర్ జడా సుబ్బారావు, వార్డెన్ నగేష్ అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్యను సత్కరిస్తున్న ఆర్‌జియుకెటి యాజమాన్యం

ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లు ఇప్పటివరకు కూడా విడుదల చేయకపోవడానికి కారణం ఏంటని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ సిటీ ప్లీనం సమావేశాన్ని స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రయివేట్ కళాశాలల్లో డిగ్రీ అడ్మిషన్లు నూరికి నూరు శాతం పూర్తయ్యాయని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఎదుచూసిన విద్యార్థులు కూడా ప్రయివేట్ కాలేజీల వైపు వెళ్లిపోయారన్నారు. గతేడాది డిగ్రీ అడ్మిషన్లు జులై నెలాఖరులోపు పూర్తయ్యాయని, ఈ సంవత్సరం ఆగస్టు వచ్చినా ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. డిగ్రీలో డబల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మేజర్. మైనర్ విధానం వల్ల రాష్ట్రంలో పలు కాలేజీలు మూతపడే అవకాశం ఉందని చెప్పారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఇప్పటివరకు భర్తీ కాలేదన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తానన్న డిఇఒ ఎక్కడున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల అటెండెన్స్ పర్సంటేజ్ తగ్గిపోతుందని, డ్రాపవుట్ సంఖ్య కూడా ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయని, ప్రయివేట్ పాఠశాలలు మండల కేంద్రాల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల వైపు దృష్టి పెట్టకుండా ప్రయివేట్ కార్పొరేట్ విద్యావ్యవస్థను పెంచి పోషించడంపై దృష్టి పెడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బి.మనోజ్, ఉపాధ్యక్షులు ఎస్.శివాజీ, జయం శివ, రాజా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

శిక్షలు పడే చర్యల్లో కోర్టు కానిస్టేబుల్స్ కీలకం

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ఏలూరు స్పోర్ట్స్ :నిందితులను అరెస్టు చేసిన తర్వాత వారికి శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టే ప్రక్రియలో కోర్టు కానిస్టేబుల్స్ ఎంతో కీలకమైన వారని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పోలవరం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న సిఐలు, ఎస్‌ఐలు, డిఎస్‌పిలతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లో పనిచేసే కోర్టు కానిస్టేబుల్స్ తో ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు చేసి చార్జిషీట్లను కోర్టులో పొందుపరిచిన తర్వాత కోర్టు కానిస్టేబుల్స్ వారికి శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్‌కు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో అగ్రభాగాన సిఐటియు

జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు

జెండా ఎగురవేస్తున్న నేతలు

ప్రజాశక్తి - నిడమర్రు

కార్మిక సమస్యల పరిష్కారంలో సిఐటియు అగ్రభాగాన ఉందని జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల 11వ మహాసభ శనివారం నిర్వహించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికంగా సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు మోహన్‌రావు ఎగురవేశారు. ఇటీవల కాలంలో మరణించిన సిఐటియు నాయకులకు సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. అనంతరం జరిగిన సభలో ఆర్.లింగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పి-4 వంటి పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యం కాదని, కార్మికులకు జీతాలు పెరగడం ద్వారా, కొత్త ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. సిఐటియు జాతీయ మహాసభ డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 15న చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కానూరి రాజు, కో-కన్వీనర్‌గా ఎ.నాగమణి మరో పదిమందితో నూతన కమిటీ ఎన్నికైంది.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న తమకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని ఎస్‌సి నగర్ గిరిజన పేదలు శనివారం తహశీల్దార్ టి.సాయిబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు అనుమోలు మురళి, మడకం సుధారాణి మాట్లాడుతూ మండలంలోని ఎస్‌సి నగర్ ప్రభుత్వ భూమిలో గత కొన్నేళ్లుగా సుమారు 50 మంది పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. భూమి లేని నిరుపేదలుగా ఉన్న వారికి భూములు కేటాయించాలని కోరారు. ఈ భూములపై హైకోర్టు వారు కూడా ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. పట్టాలు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ పేదల వివరాలు ఇవ్వాలని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో శీలం భరత్ కుమారి, బరగడ కుమారి, తదితరులు ఉన్నారు.

పుంత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తా

గోపాలపురం ఎఎంసి చైర్మన్ బ్రహ్మాజీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలో రైతులకు అవసరమైన పుంత రోడ్లకు నిధులు కేటాయిస్తానని గోపాలపురం ఎఎంసి చైర్మన్ యడ్లపల్లి బ్రహ్మాజీ అన్నారు. శనివారం నిర్వహించిన ద్వారకాతిరుమల మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ అందరూ సహకరించాలని కోరారు. మండలంలో రైతులకు అవసరమైన పుంత రోడ్ల నిర్మాణానికి ఎఎంసి నిధులు కేటాయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు ఎంపిపి సత్యనారాయణ, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, ఎంపిడిఒ ప్రకాష్, తహశీల్దార్ సుబ్బారావు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తాం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోల్‌రాజ్ కాలువపైన భూములకు సాగునీటిని పూర్తి స్థాయిలో అందిస్తామని కృష్ణా జిల్లా ఇరిగేషన్ ఎస్ఇ ఆర్.మోహన్‌రావు, ఇరిగేషన్ ఇఇ ఆంజనేయప్రసాద్ అన్నారు. పోల్‌రాజ్ కాలువపైన వరదేలు నీటి ప్రవాహం ఎలా ఉందో ఉన్నతాధికారులతో ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్ఇ మోహన్‌రావు రైతులతో కలిసి నీటి లభ్యత గురించి చర్చించారు. నీటిని పొదుపుగా వాడడం, నీటి వనరులను కాపాడుకోవడం, ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా ఉండడం గురించి చర్చించారు. సాగునీటిని ఆక్వా రైతులు చేపల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోపవరం, శీతనపల్లి కాలువలకు సంబంధించిన రైతులతో నీటి లభ్యతపై ప్రత్యక్షంగా ముఖాముఖి నిర్వహించారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ ఎఇలు కె.వి.సత్యనారాయణ, బి.సిద్ధార్థ, లాకుల సూపరింటెండెంట్ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో చర్చిస్తున్న ఎస్ఇ మోహన్‌రావు

పొగాకు బోర్డు హమాలీలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం టుబాకో బోర్డు 18వ వేలం కేంద్రంలో హమాలీలు, స్వీపర్లు 55 మందికి డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు శనివారం దుస్తులు అందించారు. ఐదు రోజుల క్రితం జంగారెడ్డిగూడెం టుబాకో బోర్డును ఆయన సందర్శించిన సందర్భంగా హమాలీలకు నూతన వస్త్రాలు బహుకరిస్తానని మాట ఇచ్చారు. ఆ ప్రకారం దుస్తులను కరాటం వెంకటరెడ్డి నాయుడు (రెడ్డి బాబు), బుట్టాయగూడెం పొగాకు రైతుల చేతులమీదుగా హమాలీలకు అందించారు. ఈ కార్యక్రమంలో వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు పరిమి రాంబాబు ఎ ఎస్ సురేంద్ర పాల్గొన్నారు.

మానవతా కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ

జయంతి కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

మానవతా కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవ అని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బళ్లారి రాఘవ చిత్రపటానికి డిఆర్ఒ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బళ్లారి రాఘవ నాటక రంగంలో సంచలనాలు సృష్టించి సినిమా రంగం వైపు వెళ్లిన గొప్పనటులన్నారు. తొలితరం కథానాయకుల్లో రాఘవ ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకరరావు, జిల్లా టూరిజం మేనేజర్ ఎస్.పట్టాభిరామన్న, కలెక్టరేట్‌లోని పలు విభాగాల సూపరింటెండెంట్లు ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు స్పోర్ట్స్ : సామాజిక మార్పు కోసం నాటకాల ద్వారా ఎంతో కృషి చేసిన కళా సేవకుడు బళ్లారి రాఘవ ఆదర్శప్రాయులని ఎఎస్‌పి సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెలుగు నాటక రంగ పితామహుడు, న్యాయవాది, కళా సేవకుడు, సమాజ సేవకుడు బళ్లారి రాఘవ జయంతి వేడుకలు నిర్వహించారు. బళ్లారి చిత్రపటానికి ఎఎస్‌పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఆర్ సిబ్బందికి, మినిస్ట్రీయల్ సిబ్బందికి మిఠాయిలు పంచారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జెఎసి ఉమ్మడి జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జంగారెడ్డిగూడెంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. చోడగిరి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఎన్.రామారావు, ఎపిసిపిఎస్ఇఎ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఒపిఎస్‌ను పునర్దురించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో బాధ్యులు చైర్మన్ మోహన్, యుటిఎఫ్ అధ్యక్షుడు రుద్రాక్షి రవి కుమార్, ఎపిటిఎఫ్ అధ్యక్షుడు టి.రామారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డిదొర, ఎస్‌టియు నాయకులు, బిటిఎ, ఎపిటిఎఫ్ 1938 నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలంలోని సూరేపల్లి, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డోర్ టు డోర్ కార్యక్రమంలో చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి ఆదాయం పొందాలని సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎంఎల్ఎలు, కూటమి నేతలు



ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఐదుకోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షలకు అద్దం పట్టేలా సుస్థిరాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం పయనిస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. దేశానికి వెన్నెముకగా ఉన్న అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని స్పష్టంచేశారు. అన్నదాత సుఖీభవ - పిఎంకిసాన్ పథకం మొదటి విడత అమలులో భాగంగా ఏలూరులోని చొదిమెళ్లలో శనివారం రైతులతో సభ అట్టహాసంగా నిర్వహించారు. ఏలూరు నియోజకవర్గంలో 998 మంది లబ్ధిదారులైన రైతులకు అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకంలో భాగంగా తొలి ఏడాదిలో మొదటి విడత పెట్టుబడిసాయంగా విడుదలైన రూ.69.86 లక్షల విలువైన నమూనా చెక్కును ఎంఎల్ఎ చంటి రైతులకు అందించారు. పలువురు కౌలు రైతులకు కౌలు కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి విజయవాడ జోన్ - చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎపి ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఏలూరు అర్బన్ తహశీల్దార్ కుంచె గాయత్రి, శనివారపుపేట కో - ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోనేరు వంశీకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి రెడ్డి నాగరాజు, 27వ డివిజన్ ఇన్‌ఛార్జి యడ్లపల్లి శివ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా దెందులూరు నియోజకవర్గంలోని రైతులకు రూ.13.16 కోట్ల లబ్ధి చేకూరిందని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పోతునూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పాలన వివరిస్తూ కరపత్రాలు అందించారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని మీర్జాపురంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూజివీడు నియోజకవర్గంలో 35,529 మంది రైతులకు రూ.23.64 కోట్లు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, వ్యవసాయ సహాయ సంచాలకులు

దెందులూరులో...

జి.విద్యాసాగర్, తహశీల్దార్ బద్రు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రైతుల సమావేశానికి ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో 20095 మంది రైతులకు మొదటి విడతగా రూ.12.73 కోట్ల అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ సొమ్ము విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎఎంసి చైర్మన్ కరేటి జ్యోతి, నారాయణపురం సొసైటీ చైర్మన్ కడియాల రవిశంకర్, టిడిపి, జనసేన మండలాధ్యక్షులు పంది రాంబాబు, వేములపల్లి సుధీర్, ఉంగు టూరు సర్పంచి బండారు సింధు, కూటమి నాయకులు ఇమ్మణి గంగాధర్, పాతూరి విజయ కుమార్, శరణాల మాలతీరాణి, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ

ఉంగుటూరులో...

సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో 34,037 మంది రైతులకు సొమ్ము వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ అధికారులు ఎడి బుజ్జిబాబు, మండల స్థాయి వ్యవసాయ శాఖాధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కునూరు : టిడిపి మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచి పిచ్చుక రాజు, టిడిపి సీనియర్ నాయకులు కుచర్లపాటి రమణరాజు, జనసేన మండల ఉపాధ్యక్షుడు మొదుంపరపు వెంకన్నబాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు పరిమి సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, అల్లూరి రామకృష్ణ, కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, రాజాన సత్యనారాయణ, మానికల నాగేశ్వరరావు, బొబ్బర రాజ్‌పాల్, మహంకాళి రాంబాబు, గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలోని మేడేపల్లి సచివాలయం ఆర్‌బికెలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో 402 మంది రైతులకు లబ్ధి చేకూరిందని టిడిపి మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్ తెలిపారు.

కలిదిండి : మండలంలోని 771 మంది రైతులకు లబ్ధి చేకూరిందని టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు తెలిపారు. కలిదిండిలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.52 లక్షల నమూనా చెక్కును ప్రదర్శించారు. ఎఎంసి మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా మండలంలోని అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాట యోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య అని తెలిపారు. స్వాతంత్ర ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో ప్రథమ బహుమతి చైతన్య లక్ష్మి, ద్వితీయ బహుమతి నాగ వెంకట భానుశ్రీ, తృతీయ బహుమతి లక్ష్మీశ్రీనివాస్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, నాగరాజు, మల్లేశ్వరరావు, శ్రీ మంగలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, జీవితంలో గొప్ప స్థానాలకు ఎదగాలని ఎఎస్‌పి సూర్యచంద్రరావు కోరారు. భీమడోలుకు చెందిన మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కర్రి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో విద్యా సంస్థ పరిధిలోని పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన ఫ్రెషర్స్‌తో ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. భీమడోలు మాధురి కళాశాల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఎస్‌పి హాజరయ్యారు. అనంతరం ఆయన విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్, ఎఎస్ఐ చలపతిరావు, ఈగిల్ టీమ్ ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్, విద్యా సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది, శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు టౌన్ బాలికల హైస్కూల్లో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికుల ఏజెన్సీని, కార్మికులను వెంటనే తీసుకోవాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు చాట్ల పుల్లారావు మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి ఏజెన్సీని నడుపుతున్న కార్మికులను తొలగించడం దారుణమన్నారు. ఎస్ఎంసి కమిటీల పేరుతో మధ్యాహ్న భోజన కార్మికులను తీసివేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శోభారాణి, ఎల్.పద్మావతి, యు.కుమారి, ఎల్.పద్మ, రజని, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - మండవల్లి

రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ఇరువైపులా దట్టంగా పెరిగిన మొక్కలను తొలగిస్తున్నామని మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. జాతీయ రహదారి 165 పామర్రు, దిగుమర్రు, మండవల్లి, పెరుగుగూడెం వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్ల మొక్కలు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయి రోడ్డు పైకి వచ్చాయన్నారు. తరుగుమూల కొర్లపాడు వద్ద ఉన్న మలుపులో దట్టంగా పెరిగిపోయిన మొక్కల వల్ల ఎదురు వచ్చే వాహనాలు కనిపించడం లేదన్నారు. ఆ ప్రాంతాల్లో ప్రమాదం జరిగే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ ఇచ్చిన ఆదేశాలతో జెసిబితో కంపల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

రంగమణి మృతి తీరని లోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం శనివారపుపేట నాయకురాలు గొట్టాపు రంగమణి అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మరణించారు. రంగమణి భర్త మురళి, కుమారుడు రవికిషోర్ ఇరువురు గతంలో సిపిఎం ఎంపిటిసిలుగా పని చేశారు. రంగమణి భౌతికకాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పివి.రామకృష్ణ, నగర కార్యదర్శి పంపన రవికుమార్ సిపిఎం పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగమణి భౌతికకాయానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ గొట్టాపు మురళి, రంగమణి దంపతులు కుటుంబం మొత్తాన్ని కమ్యూనిస్టులుగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారని చెప్పారు. సిపిఎం మహిళా నాయకురాలిగా రంగమణి ప్రజాసమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. శనివారపుపేటలో సిపిఎం ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి పార్టీ గెలుపుకోసం అహర్నిశలు శ్రమించారని చెప్పారు. రంగమణి మరణం పార్టీకి తీవ్రమైన లోటుగా ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం రంగమణి అంత్యక్రియలు జరుగుతాయని చెప్పారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎం.ఇస్సాక్, సిపిఎం మాజీ కౌన్సిలర్ కంది విశ్వనాదం, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జి.శివకుమార్, ఎస్ఎన్.రమేష్, ఐవి.సుధాకర్, కడలి రామాంజనేయులు, సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

డిపెండబుల్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు విఆర్ఒ, విఆర్ఎ దందా!

విఆర్ఒ, అర్జీదారుడికి మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఒక గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి, మరో గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు వారిద్దరూ కుమ్మక్కై, డిపెండబుల్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన సంఘటన శనివారం తహశీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. మండలంలోని చిగురుకోట విఆర్ఒ, వడాలి విఆర్ఎ కలిసి పనిచేసే గ్రామంతో పాటు సంబంధం లేని గ్రామంలో తల దూర్చి ఈ విధంగా వివిధ రకాల దందాలు చేయడం వారికి పరిపాటిగా మారింది. వడాలి గ్రామానికి చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు చెల్లి వికలాంగురాలు, ఇటీవల తల్లి మృతి చెందింది. చెల్లి జీవనోపాధి కోసం తల్లికి వచ్చే పెన్షన్‌ను చెల్లికి ఇచ్చేందుకు డిపెండబుల్ సర్టిఫికెట్ కోసం 20 రోజుల క్రితం దరఖాస్తు చేశారు. డిపెండబుల్ సర్టిఫికెట్ సిద్ధమైంది. తహసిల్దార్ కార్యాలయానికి రావాలని వడాలి విఆర్ఎ అర్జీదారుడు శ్రీనివాసరావుకు ఫోన్ చేశారు. సర్టిఫికెట్ నమూన శ్రీనివాసరావుకు వాట్సాప్ పెట్టారు. దీంతో శ్రీనివాసరావు విజయవాడ నుంచి హుటాహుటిన బయలుదేరి వచ్చారు. తహశీల్దార్ కార్యాలయంలో సంబంధిత మండల రెవెన్యూ అధికారులతో ఆరేపల్లి శ్రీనివాసరావు సర్టిఫికెట్ విషయంపై మాట్లాడుతుండగా చిగురుకోట గ్రామ రెవెన్యూ అధికారి అక్కడకు వచ్చి కలగజేసుకుని మాట్లాడారు. అక్కడ ఉన్న మండల స్థాయి అధికారి సంబంధం లేని గ్రామానికి ఎందుకు వెళ్లావని చిగురుకోట గ్రామ రెవెన్యూ అధికారిని మందలించారు. అర్జీదారుడు శ్రీనివాసరావు విఆర్ఒల గదికి వెళ్లి అక్కడ ఉన్న

అర్జీదారునికి సర్ది చెబుతున్న అధికారులు

పలువురు విఆర్ఒలకు, వడాలి గ్రామస్తులకు సర్టిఫికెట్ కోసం చిగురుకోట విఆర్ఒ, వడాలి విఆర్ఎ కలిసి రూ.ఏడు వేలు, ఒక ఫుల్ బాటిల్ మిలిటరీ మందు ఇవ్వాలని డిమాండ్ చేశారని చెబుతున్నాడు. దీంతో చిగురుకోట విఆర్ఒ అక్కడికి వచ్చి కలగజేసుకుని శ్రీనివాసరావుపై దురుసుగా మాట్లాడాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం తీవ్ర స్థాయికి చేరడంతో ఒకరిపై ఒకరు అరుపులు కేకలతో తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణమంతా దద్దరిల్లింది. అరుపులు, కేకలు విన్న తహశీల్దార్ కార్యాలయం, సమీపంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పరుగులు తీసుకొచ్చారు. దీంతో మండల స్థాయి, గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు, పలువురు రైతులు వచ్చి ఇరువురికి సర్ది చెప్పి శ్రీనివాసరావును విఆర్ఒల గది నుంచి బయటకు తీసుకొచ్చారు. నీకు సంబంధం లేని గ్రామ విషయమై జోక్యం చేసుకుని సర్టిఫికెట్ విషయమై ఎందుకు డబ్బులు డిమాండ్ చేశావంటూ చిగురుకోట విఆర్ఒను రెవెన్యూ అధికారులు మందలించారు. అనంతరం వడాలి విఆర్ఎ తహశీల్దార్ కార్యాలయానికి సంఘటన జరిగిన గంట తర్వాత వచ్చారు. విఆర్ఒ, విఆర్ఎను మందలించి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు ఉంటాయని మండల స్థాయి అధికారులు అన్నట్లు సమాచారం.

ఘనంగా వైసిపి నేత రాజశేఖర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైసిపి ప్రచార విభాగ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి, లీడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ పుట్టినరోజు వేడుకను వైసిపి మండల నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి పిహెచ్‌సిలో రోగులకు, వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు కంబాల ప్రదీప్, షేక్ సుభాని, మల్లంపల్లి రవిశేఖర్, నెరుసు రాజేష్, పెనుముచ్చు కమలాకర్, లింగంపల్లి లాజర్, పెనుముచ్చు మహేష్‌బాబు, బార్లపూడి తిరుపతిరావు, చవటపల్లి ఏసుబాబు పాల్గొన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు (ముర్రిపాలు) ఇవ్వాలని తంగెళ్లమూడి (ఎంఆర్‌సి కాలనీ) పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు తంగెళ్లమూడి ఎంఆర్‌సి కాలనీ-1 అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ తల్లిపాలు తాగిన బిడ్డ జ్ఞాపక శక్తి పెరిగి చురుగ్గా ఉంటాడని చెప్పారు. ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, ఎఎన్ఎంలు రెహమున్నిస్సా బేగం, నాంచారమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమడోలు : తల్లిపాల ప్రాముఖ్యత, ఆవశ్యకత, దాని ద్వారా తల్లి పిల్లల ఆరోగ్య పరిరక్షణ అంశాల పట్ల తల్లులకు అవగాహన ఉండాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్, భీమడోలు సెక్టార్ పర్యవేక్షకులు ఎం.రూపదేవి కోరారు. పొలసానిపల్లిలో శనివారం అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీకుమారి ,నాగమణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాన్ని సెక్టార్ పర్యవేక్షకుల పర్యవేక్షణలో నిర్వహించారు. పురవీధులలో ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్య ఆరోగ్యశాఖ గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ రామకృష్ణ, సెక్టార్ పర్యవేక్షకులు, మురళీ ఇతర ప్రముఖులు ప్రసంగించారు.

ఉంగుటూరు : తల్లిపాలతో బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసిడిఎస్ ఆర్‌జెడి బి.సుజాతారాణి అన్నారు. చేబ్రోలు పిహెచ్‌సిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు, గర్భిణులకు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు శ్రావణ్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి సెక్టార్ పరిధిలోని దర్భగూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసిడిఎస్ సిడిపిఒ తులసి మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలను ఇవ్వడం ద్వారా బిడ్డకు శ్రేష్ఠమన్నారు. అనంతరం పిల్లలకు వండే ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, కార్యకర్తలు ఝాన్సి, లక్ష్మి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వా ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి : తల్లిపాలు బిడ్డకు జీవ రక్షణ బిందువులని ఎఎన్ఎం స్వప్న అన్నారు. మండవల్లిలోని ఆరో అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె శనివారం పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మి, ఆయా కరుణ, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఇన్‌ఛార్జి ఎంఇఒగా సత్యనారాయణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఇన్‌ఛార్జి ఎంఇఒగా పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎల్.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను మండల ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో గూటాల లిటిల్ ఫ్లవర్ యుపి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ గెడ్డం అబ్రహం, విజ్ఞాన జ్యోతి స్కూల్ కరస్పాండెంట్ శంకరం, సెయింట్ జాయ్ స్కూల్ కరస్పాండెంట్ లివింగ్ స్టన్, సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, విజ్ఞాన భారతి స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీను పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు అబ్దుల్‌మతీన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్‌కె.అబ్దుల్‌మతీన్ సమాచార హక్కు చట్టం 2005ను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఆర్‌సి స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు విద్యార్థిని అభినందిస్తూ జోనల్ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

రాయితీ రుణాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

బ్యాంకులు అందిస్తున్న రాయితీ రుణాలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు గుడివాడ డివిజనల్ నాబార్డ్ కౌన్సిలర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నిచ్చుమిల్లిలో మహిళా సంఘాలకు రుణాలపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ బ్యాంకుల ద్వారా అందిస్తున్న సురక్ష బీమా జన శ్రీ బీమ వ్యక్తిగత రుణాలు ముద్ర రుణాలు వ్యాపార అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. రుణాలు ఎలా పొందాలో తిరిగి ఎలా చెల్లించాలో అవగాహన కల్పించారు.

10 నుంచి వ్యకాస జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - లింగపాలెం

జిల్లా అభివృద్ధి వ్యవసాయ రంగాభివృద్ధితో ముడిపడి ఉందని, వ్యవసాయ రంగంలో రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు జోడెడ్లవంటి వారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశాలకు జిల్లా వ్యాప్తంగా 150 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ తరగతుల జయప్రదానికి మండలంలో ఉన్న విద్యావేత్తలు, మేధావులు, ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం, వ్యాపారవేత్తలు సహకరించాలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం.1461/2022

ఇన్ ఒ.యస్.నెం.50/2022

బిట్వీన్ :
భార్గవ ఫుడ్ ప్రోడక్ట్స్ తరపున చింతలపాటి నారాయణమూర్తిరాజు ...పిటిషనరు/వాది
మరియు
కూరపాటి బాలరాజు (డైయిడ్) వగైరాలు ...రెస్పాండెంటు/ప్రతివాద్లు

పై నెంబరు దావాలో మీరు అనగా 1.కూరపాటి మరియమ్మ, 2.కూరపాటి కీర్తి 3.కూరపాటి సంతోష్ కుమార్లు చనిపోయిన కూరపాటి బాలరాజు గారి వారసులుగా చేర్పించమని పిటీషన్ దాఖలు చేసి అందులో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసికొనక నిరాకరించుచున్నారు. కావున మీరు ది.19-08-2025 సం॥తేది ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయముగా కాని మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషి తెలియచేసుకోవలయును. అట్లు మీరు హాజరు కానియడల మీ పరోక్షమున తీర్మానము జరిగించెదరు.

పి.ఆంజనేయరాజు, అడ్వకేటు,
తాడేపల్లిగూడెం. సెల్ : 9848018256

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం.1462/2022

ఇన్ ఒ.యస్.నెం.50/2022

బిట్వీన్ :
భార్గవ ఫుడ్ ప్రోడక్ట్స్ తరపున చింతలపాటి నారాయణమూర్తిరాజు ...పిటిషనరు/వాది
మరియు
కూరపాటి బాలరాజు (డైయిడ్) వగైరాలు ...రెస్పాండెంటు/ప్రతివాద్లు

పై నెంబరు దావాలో మిమ్ములను అనగా 1.కూరపాటి మరియమ్మ, 2.కూరపాటి కీర్తి 3.కూరపాటి సంతోష్ కుమార్లు చనిపోయిన కూరపాటి బాలరాజు గారి స్థానే పార్టీలుగా చేర్పించమని పిటీషను దాఖలు చేసి అందులో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసికొనక నిరాకరించుచున్నారు. కావున మీరు ది.19-08-2025 సం॥తేది ఉదయం గం.10.30 ని॥ల లగాయితు శ్రీకోర్టు వారి ఎదుట స్వయముగా కాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషి తెలియచేసుకోవలయును. అట్లు మీరు హాజరు కానియడల మీ పరోక్షమున తీర్మానము జరిగించెదరు.

పి.ఆంజనేయరాజు, అడ్వకేటు,
తాడేపల్లిగూడెం. సెల్ : 9848018256